

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం, 26 జూన్ 2025 — 8 పేజీలు

రాయచోటి పట్టణంలో యాంటీ డ్రగ్స్ అబ్యూస్ ర్యాలీ

విశాలాంధ్ర-రాయచోటి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం రాయచోటి పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, ఇది సమాజంలో మాదకద్రవ్యాల నివారణకు, వాటి నుంచి యువతను దూరంగా ఉంచడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన సామాజిక చొరవతో ప్రజల్లో చైతన్యం నింపేలా, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ర్యాలీ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు విధించినట్లు, వాహనదారులు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన, క్రీడలు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పాల్గొంటారు.

2లో

- బెట్టింగ్, ఆన్లైన్లో పేకాట/గేమ్స్
- వ్యసన పరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు
- తక్కువ మొత్తంతో మొదలెట్టి పోగొట్టుకున్న వేలు, లక్షల రూపాయలు
- కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు
- అవి చెల్లించలేక నానా తిప్పలు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనం
- ఆలస్యంగా గుర్తిస్తున్న తల్లిదండ్రులు

యువత.. పెడదారి!

ఓ యువకుడు కొద్ది రోజులుగా ముభావంగా ఉండడంతోపాటు ఇంట్లో వాళ్లను తరచూ డబ్బులు అడగడం మొదలెట్టాడు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పడం లేదు. గట్టిగా నిలదీస్తే చనిపోతానంటూ బెదిరించసాగాడు. తల్లిదండ్రులకు విషయం ఏమిటో అర్థం కాక మానసిక వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. సదరు వైద్యుడు కౌన్సెలింగ్ నిర్వహించి మెల్లగా విషయాన్ని రాబట్టారు. తల్లిదండ్రులకు తెలియకుండా నాలుగు లక్షలు రూపాయలు అప్పు చేసి, ఆన్లైన్లో పేకాటలో పోగొట్టినట్టు చెప్పాడు.

పాన్ కార్డు, ఆధార్ కార్డుతో అప్పులు..

అప్పులు ఇచ్చేందుకు అనేక రకాల యాప్లు అందుబాటులోకి వచ్చాయి. పాన్కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ ఉంటే చాలు అప్పులు ఇస్తున్నారు. అయితే, భారీమొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారు. ఈ తరహా యాప్లు, కొందరు అప్పులు క్లియర్ చేసినా వారిని వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇదిలావుండగా సులభంగా అప్పులు దొరుకు తుండడంతో ఇంట్లో తెలియకుండానే చాలామంది ఈ తరహా దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ అప్పులు భవిష్యత్తులో వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్న విషయాన్ని గ్రహించడం లేదు.

ఆర్థిక అవసరాలపై దృష్టి అవసరం

2లో

పిల్లల ఖర్చుపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ఈ తరహా వ్యసనాలకు ప్రాథమిక దశలోనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరాలను తీర్చే పనులు చేయడం, ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు అడగకపోవడం, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బులు అడగడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, ఒంటరిగా ఉండేందుకు యత్నించడం వంటివి చేస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని మానసిక

> దేశ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యువకులు అడ్డదారులు తొక్కుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, పేకాట, ఆన్లైన్ గేమ్స్ వంటివి ఆడుతూ లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసలుగా మారుతూ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ తరహా యువకుల సంఖ్య గత కొన్నాళ్లుగా పెరుగుతోంది. చెడు స్నేహాలు, అలవాట్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్వేర్ ఉద్యోగి వరకూ ఉండడం గమనార్హం.నగర, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా చిన్న వయసులోనే బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్ ఆడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొదట తక్కువ మొత్తంతో ప్రారంభిస్తున్నారు. ఆ మొత్తాన్ని రాబట్టుకునే ప్రయత్నంలో వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. అందుకోసం దొరికిన చోటల్లా అప్పులు చేస్తున్నారు. - విశాలాంధ్ర-రాజంపేట

ముగిసిన బదిలీలు

కొనసాగుతున్న మాడిఫికేషన్‌లు

- మెడికల్ ఆర్డీ కార్యాలయంలో ఈ తంతు ఏమిటో..

విశాలాంధ్ర-కడప: ఉమ్మడి కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు జిల్లాల కడప ప్రాంతీయ ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వివాదాలకు అక్రమాలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతోందన్న ఆరోపణలు వస్తూనే ఉంటాయి. అనునిత్యం ఏదో ఒక వార్తతో తెరపై వస్తున్న ఆరోపణలు అనేకంగా ఉంటాయి. వైద్య ఆరోగ్య శాఖలో ఈనెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు వివిధ కాడర్‌ల్లో సుమారు 30 రకాల ఉద్యోగుల బదిలీలు జూమ్ కౌన్సిలింగ్ ప్రక్రియ జరిగినది. కానీ సాధారణంగా ఈసారి ప్రత్యేకంగా జూమ్ ద్వారా జరగడంతో అర్హులైన కొందరు ఉద్యోగులకు న్యాయం జరక్క పోగా అవినీతి ఆరోపణలున్న కొందరు ఆఫీసు సిబ్బంది అధికారుల అక్రమాలకు ఇది ప్రయోజనం చేకూరుస్తోందన్న ఆరోపణలు విన వస్తున్నాయి. జూమ్ కౌన్సిలింగ్ నందు ఖాళీల వివరాలు ముందుగా వెల్లడించకపోవడం, మొక్కుబడిగా ఖాళీలు చూపడం, 5 సంవత్సరముల పూర్తయిన ఖాళీలు కూడా ముందుగా అధికారులు తెలపక పోవడంతో చాలామంది ఉద్యోగులు ఎన్ని ఖాళీలు ఉన్నాయి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియక గందరగోళానికి గురయ్యారు. జూమ్‌లో పాల్గొన్నప్పటికీ ఖాళీలు తెలియక తెలియ ఇబ్బందులు పడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రధానంగా సీనియర్ అసిస్టెంట్స్ కేడర్, జిజిహెచ్, కడప మెడికల్ కాలేజ్, డెంటల్ కాలేజ్‌లు మొదలు ఇన్ని ఇన్న ఇన్స్టిట్యూట్‌ల్లో ఉన్న ఖాళీలు అధికారులు బ్లాక్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ అధికారులు కౌన్సిలింగ్ ముగిసిన రెండు రోజులకు అత్యంత పోటీ ఉన్న గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిమ్స్, మెడికల్ కాలేజ్, డెంటల్ కాలేజ్ నందు ఇప్పటికీ కొన్ని ఖాళీలు ఉచడము ఆ ఖాళీలకు ఆర్డర్స్ మార్చి మోడిఫికేషన్ ఆర్డర్స్ ఇవ్వడము ఆరోపణలకు తావు నిస్తోంది.కర్నూల్ జిజిహెచ్ లో 15సంవత్సరము నుండి పనిచేసిన ఒక సీనియర్ అసిస్టెంట్ ముందుగా జూమ్ లో వారికి అదే జిజిహెచ్ కు రీటైన్ చేయడం జరిగింది. రిటైన్ చేయుటకు అతనికి యూనియన్ లెటర్ గాని, స్పౌజ్ గాని లేదని సమాచారం. కీలకమైన మెడికల్ కొనుగోలు సీటు చేయు ఉద్యోగి కావడం గమనార్హం.

2లో

జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన బాలసుబ్రమణ్యం

2లో

విశాలాంధ్ర-రాయచోటి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాజంపేట టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్య క్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుబ్రమ ణ్యానికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎం పీ మిథున్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రెడ్డెప్పగారి రమేష్ కుమార్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి,

సొసైటీలకు మరో 35రోజులు ఇన్‌ఛార్జీలే

- ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర-అట్లూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఇప్పట్లో కమిటీల నియామకం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పాలన ముగియడం తో మరో 35 రోజులు పాటు ప్రత్యేక పాలన ప్రకటించింది. దీంతో పిఎసిఎస్ నామినేటెడ్ కమిటీలపై ఆశలు పెట్టుకున్న నేతలు ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. జిల్లాలో 72 పిఎసిఎస్‌లు ఉన్నా యి. వీటికి 2019 నుంచి సహకార ఎన్నికలను గత ప్రభుత్వం నిర్వహించక పోవడంతో నామినేటెడ్ కమి టీలతో కాలయాపన చేస్తూ వస్తుంది. కమిటీల పదవీకాలం గతేడాది డిసెంబర్ నాటికి పూర్తి కాగా తిరిగి అధికారుల నే ప్రత్యేక అధికారులుగా నియమించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినా అనంతరం మొదటిసారిగా పిఎసిఎస్ ఎన్నికల అవకాశం వచ్చిన ఎన్నికలను నిర్వహించ కుండా పార్టీలలో పలువురు నేతలకు పిఎసిఎస్ పదవులతో కమిటీలను ప్రకటిస్తారని అందరూ భావించారు. కానీ అనూహ్య రీతిలో కూటమి ప్రభుత్వం ఉన్న ప్రత్యేక అధికారుల పాలననే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. సహకార శాఖ సిబ్బంది ఎంతో ఉత్కంఠంగా ఎదురుచూసిన ప్రకటన వెలువడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

2లో

ముగిసిన బదిలీలు.. కొనసాగుతున్న మాడిఫికేషన్‌లు

మొదటి పేజీ తరువాయి

కడపలో ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు ఇలా చేశారో దేవుడి కే ఎరుక. మూడు సంవత్సరముల దాటిన ప్రతి ఉద్యోగిని కనీసం పక్క ఆఫీసుకైనా తరలించాలి. అనే ఆదేశాలు ఉన్నవి ఇవేవీ వర్తించకుండా అతనికి దర్జాగా అదే స్థానంలో కొనసాగించారు. కొందరు ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా సాక్షాత్తు అధికారులు జిజిహెచ్ ఆసుపత్రి మీద విచారణ చేసి ఆ ఉద్యోగంలో అతను చేసే సీటు ఎన్ని సంవత్సరాలు నుండి చేస్తున్నారనే వివరాలు సేకరించి రాష్ట్ర ఉన్నతాదికారులకు బదిలీ కాకుండా మేనేజ్ చేసుకుని అధికారుల అండతో జరిగినదని రిపోర్ట్ తెలపగా రాష్ట్ర ఉన్నతాధికారులు రీజనల్ డైరెక్టర్ అధికారులపై సీరియస్ అయ్యారు. అప్పటికప్పుడు తిరిగి అతన్ని కర్నూలు జిల్లాలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయడం జరిగింది. ఇదంతాయో నిబంధనలకు విరుద్ధంగా రీజనల్ డైరెక్టర్ ఆఫీసు అధికారులు సిబ్బంది చేయడానికి ఆస్కారం ఏర్పడినదని పీక్లు రకాల ఉద్యోగులు వాపోతున్నారు. అలాగే జూమ్ కౌన్సిలింగ్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ ఉద్యోగులను యూనియన్ లెటర్లు అడ్డుపెట్టుకొని వారు బదిలీ కాకుండా అలాగే ఉండడము, బదిలీ జూమ్ ముగిసిన తర్వాత కడప జిజి హెచ్ లో బ్లాక్ చేసిన ఖాళీని ఒక సీనియర్ అసిస్టెంట్ కు కేటాయించడము జరిగింది. అన్నమయ్య జిల్లాలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రీటైన్ చేసిన సీనియర్ అసిస్టెంట్ను తిరిగి అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ ఓ కార్యాలయానికి వేయడము వివాదాస్పదం అయింది. జూమ్ కౌన్సిలింగ్ పూర్తయిన రెండు రోజులకు మరల ముగ్గురు సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు మోడిఫికేషన్ ఆర్డర్లు ఇవ్వడం జరిగింది. కర్నూల్ కి చెందిన ఒక సీనియర్ అసిస్టెంట్ అదే కర్నూల్లో ముందు ఇవ్వడం. మరల కడప జిజిహెచ్ ఇవ్వడం జరిగింది. వీరి స్పౌజ్ కడప క్యాన్సర్ లో ఉన్నారు.

కడప జిల్లా వేములకు చెందిన ఒక సీనియర్ అసిస్టెంట్ను ముందుగా అదే స్థానంలో రిటైన్ చేసి రెండు రోజుల తర్వాత తిరిగి జిజెహెచ్ కడపకు ఇవ్వడం జరిగింది. చిత్తూరు జిల్లాలోని తీర్థం అనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సీనియర్ అసిస్టెంట్ ను ముందుగా సుదూర ప్రాంతానికి వేయగా తిరిగి రెండు రోజుల తర్వాత బైరెడ్డిపల్లి అనే పీహెచ్సీకి మోడిఫికేషన్ చేసి ఆర్డర్స్ ఇవ్వడం ఆశ్చర్యము కలిగిస్తున్నది. అలాగే కర్నూలు జిల్లా నుండి ఒక మల్టీపర్పస్ హెల్త్ సూపర్వైజర్ ను కడప జిల్లా ఒక ప్రాథమిక ఆరోగ్యంద్రానికి బదిలీ చేసి తిరిగి కడప జిజిహెచ్‌కి వేసినట్లు తెలిసింది. అలాగే ఆఫీసు సూపరింటెండెంట్ క్యాడర్ ఉద్యోగికి కర్నూలు జిల్లాలో వారి స్పౌజ్ పనిచేయగా ఏకంగా వారిని అక్కడ ఖాళీ ఉన్న వారిని వేయకుండా మదనపల్లి జిల్లా ఆస్పత్రి నందు నియమించుట ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆర్డర్లు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఇవన్నీ వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయము నందు చిత్ర విచిత్రాలుగా సాధారణ ఉద్యోగులకు ఒకరకంగానూ, కొందరికి మరొక రకంగానూ చేయుట సర్వ సాధారణమైపోయిందని ఉద్యోగ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మాడిఫికేషన్ ఆర్డర్లపై సమగ్రమైన విచారణ చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి వృద్ధులకు దివ్యాంగులకు రేషన్

- తహసీల్దార్ భాగ్యలత

విశాలాంధ్ర-గాలివీడు: ప్రభుత్వం ఆదేశాల మేరకు 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు నేటి నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. రేషన్ పంపిణీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం డీలర్లతో సమావేశం నిర్వహించి దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటూ వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే డీలర్లు రేషన్ పంపిణీ చేస్తారన్నారు. అందులో భాగంగానే జూన్ 26 వ తేదీ గురువారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చెయ్యడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భవానీ శంకర్, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి ఇన్చార్జి మండలాభివృద్ధి అధికారి, వీరకిషోర్ మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌కు ఏపీ రవీంద్రకు ఘనసన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాటాడుతూ మైదుకూరు నియోజకవర్గం అతి చిన్న వయసులో మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలను కల్పించిన మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ అవకాశం కల్పించడంతో అవకాశాన్ని సదినియం చేసుకొని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలకు అందుబాటులో నుండి పార్టీ కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లెపల్లె సర్పంచ్ భర్త తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, చిలమల నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

సొసైటీలకు మరో 35రోజులు ఇన్చార్జిలే

మొదటి పేజీ తరువాయి

డీసీసీబి చైర్మన్ నియామకం జరిగినా..

ప్రస్తుతం అన్ని జిల్లాలతో పాటు ఉమ్మడి కడప జిల్లాకు డీసీసీబి చైర్మన్ నియామకం జరిగింది. చైర్మన్ గా మంచూరు సూర్యనారాయణ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతో తాజాగా పిఎసిఎస్ ల కమిటీలపై నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈనెల 20 తో ప్రత్యేక పాలన గడువు ముగియడంతో కమిటీల ప్రకటనకు ఎదురు చూశారు. కానీ జూలై నెలాఖరు వరకు అధికారుల పాలనను పొడిగించారు. దీంతో మరో 35 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు మొదటి వారంలో సొసైటీలకు నామినేటెడ్ పదవులను ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ నేతలు చెప్పుకుంటున్నారు.

జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన బాలసుబ్రమణ్యం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, పుంగనూరు నేత శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ తరఫున సుగవాసి సుబ్రమణ్యంకు సముచిత గుర్తింపు, స్థానం లభిస్తుందని నేతలు భరోసా ఇచ్చారు. వైఎస్ఆర్ సిపి సీనియర్ నేతలు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే సామాన్యుని పార్టీ అని కుల, మత, ప్రాంత వివక్షలకు అతీతంగా అన్ని వర్గాలను గౌరవించే పార్టీ. ఇందులో సీనియర్ నేతలకు గౌరవం ఉంటుంది, అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. సుబ్రమణ్యం లాంటి నేతల చేరికతో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సుగవాసి సుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్ జగన్ గారి నేతృత్వంపై నాకు విశ్వాసం ఉంది. ప్రజల కోసం పనిచేసేలా, పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తాను. నాకు ఇక్కడ గౌరవం, అవకాశాలు ఉంటాయని నమ్మకం ఉందని అన్నారు.

స్థలాన్ని కబ్జా చేసిన టిడిపి నేత

- మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణంలో మా స్థలాన్ని టిడిపి పార్టీకి చెందిన ఒక నాయకుడు కబ్జా చేశాడని బాధితుడు శ్రీపతి చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక బలిజ కళ్యాణమండపంలో ఆయన తల్లిదండ్రులు రామమునెమ్మ, శ్రీపతి బాలుడుతో కలిసి విలేకరుల దగ్గర తమ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదేమి అడుగుతే మాపై దౌర్జన్యానికి దిగుతున్నాడన్నారు. పులివెందులలో న్యాయం లేదా.. ప్రభుత్వం ఉంది కదా అని సామాన్యుల స్థలాన్ని ఆక్రమించుకొని దౌర్జన్యానికి దిగు తున్నారు న్యాయం లేదా..అని ప్ర శ్నించారు. టీడీపీ నాయకుడు మా ప్లాట్‌ను ఆక్రమించి మాపై దౌర్జన్యా నికి దిగుతున్నాడని భూఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. అతడు అతడి అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని పులివెందుల పట్టణంలోని మైత్రి లేఔట్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. 2008లో పులివెందుల పట్టణం మైత్రి మున్సిపల్ లేఅవు ట్లో 10వ నెంబరు ప్లాట్ను తాము కొనుగోలు చేశామన్నారు. సదరు ప్లాట్ను టీడీపీకి చెందిన నాయకుడు ఫోర్జరీ సంతకాలతో లింకు డాక్యుమెంటు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్ అదే ఆమెతోనే చేయించుకున్నారని ఆరోపించారు. తమ స్థలం పక్కనే ఉన్న కాల్వ భూమి కూడా ఆక్రమించుకుని మున్సిపల్ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారన్నారు. తమ స్థలంలో తాము ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డును సోమవారం రాత్రి ఆయన అనుచరులతో వచ్చి ధ్వంసం చేశారని ఆయన వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే అనుచరులతో కాళ్లు చేతులు విరిచేస్తామని బెదిరించారని వాపోయారు. అక్రమ దందా సాగిస్తున్న అతని నుంచి తమకు రక్షణ కల్పించాలని లేదంటే తమ కుటుంబానికి ఆత్మహత్య తప్ప వేరే గతి లేదని తెలిపారు. ఈ భూకబ్జాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రినారా లోకేష్‌లు స్పందించాలని ఆయన కోరారు.

యువత.. పెడదారి.!

మొదటి పేజీ తరువాయి

వైద్యులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు బంధువులు వద్ద కూడా అప్పులు చేస్తుంటారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వేగంగా వాటి నుంచి దూరంగా ఉండేలా చేయవచ్చునని చెబుతున్నారు. ఆలస్యం అయితే ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోవడంతోపాటు కొన్నిసార్లు పిల్లల ప్రాణాలు కోల్పోవచ్చునని చెబుతున్నారు.

అన్ని శాఖల సమన్వయంతోనే రాష్ట్ర ఆదాయం పెంపు సాధ్యం

మొదటి పేజీ తరువాయి

విశాలాంధ్ర-రాయచోటి: అన్ని శాఖల సమన్వయంతోనే రాష్ట్ర ఆదాయం పెంపు సాధ్యమని పన్నుల పరిధిలోకి రాకుండా తప్పించుకునే వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర జిఎస్టి ఆదాయంపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ జీఎస్టీ అధికారి, జిల్లా పంచాయతీ శాఖ మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లు ఆడిట్ శాఖ తదితర శాఖల వారు జిఎస్టి ఆదాయాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమయ్యే ఆదాయాన్ని పన్నుల ద్వారా సమీకరిస్తుందన్నారు. రాష్ట్ర జిఎస్టి ఆదాయాన్ని పెంచడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిఎస్టి శాఖ వారికి అవసరమైన వివరాలను ఇతర శాఖల అధికారులు చట్టపరిధికి లోబడి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘా స్వరూప్, నైడియా దేవి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా జిఎస్టి శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి పట్టణంలో యాంటీ డ్రగ్స్ అబ్యూస్ ర్యాలీ



ట్రాఫిక్ మళ్లింపు వివరాలు ఇలా ఉన్నాయి

ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1వరకు అమలులో ఉంటాయి. రాయచోటి పట్టణంలోని ప్రధాన రహదారులైన కడప రింగ్ రోడ్డు నుండి, చిత్తూరు రింగ్ రోడ్డు వరకూ, మదనపల్లి రింగురోడ్డు వరకూ, రాయచోటి పట్టణంలోకి ఎటువంటి వాహనాలకు ప్రవేశం లేదు. కావున అందరూ సహకరించగలరు.

యోధులను స్మరించుకునేందుకే హత్య దినోత్సవం

మొదటి పేజీ తరువాయి

విశాలాంధ్ర-రాయచోటి: ఎమర్జె న్సీ సమయంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడిన యోధులను స్మరించుకునేందుకే రాజ్యాంగ హత్య దినం జరుపుకుంటు న్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. జూన్ 25, బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో రాజ్యాంగ హత్య దినంను నిర్వహించారు. 1975 జూన్ 25 న ఎమర్జెన్సీ విధించిన సమయంలో విద్యార్థులుగా ఉన్న నరేంద్ర, సంపత్ కుమార్‌లు మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో ప్రజల ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని వాటికి ప్రత్యక్ష సాక్షులు తామేనని పేర్కొన్నారు. పోలీసులు తమను కస్టడీ లోకి తీసుకొని చాలా ఇబ్బందులకు గురి చేశారని వాటన్నిటిని ఎదుర్కొని దేశసేవ చేయగలిగామని పేర్కొన్నారు. డిఆర్ఓ మధుసూదనరావు మాట్లాడుతూ 1975 లో జరిగిన వివిధ సంఘటనల నేపథ్యంలో దేశ ప్రధాని నిమర్జెన్సీ ని విధించిందని అదే సమయంలో పెళ్లి కాని వారికి కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూధనరావు, రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన పార్టీ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ సాంబశివ స్వామి (రామలింగేశ్వర స్వామి) దేవాలయం
కత్తెరగండ్ల (గ్రా), కాశినాయన (మం), కడప జిల్లా

e-Procurement Tender
NTT No.P/COE/1363/2024-7, Dt:28.01.2025

దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు
ధర్మకర్త

ప్రపంచంపై అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించండి

- ప్రపంచంలో 104 యుద్ధాలు అమెరికా ప్రేరేపించినవే
- ఉద్ధరించే వ్యాఖ్యలు చేస్తూ, ఆయిల్, గ్యాస్, గనులు దోపిడి చేస్తున్న అమెరికా
- అమెరికా మిలిటరీ ఆయుధ వ్యాపార లాభాల కోసం యుద్ధాలు ప్రేరేపిస్తుంది
- ప్రపంచంలోని అరుదైన ఖనిజ సంపదల కోసం అమెరికా ప్రపంచ పోలీసుగా అవతారం ఎత్తింది
- అంతర్జాతీయ న్యాయ చట్టాలను వెల్లంకిస్తున్న అమెరికా, ఇజ్రాయిల్లను ఐక్యరాజ్యసమితి అడ్డుకోవాలి
- వామపక్ష పార్టీల నాయకులు వెల్లడి

విశాలాంధ్ర-కడప రూరల్: 2025 జూన్ 25వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు, కడప స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ నందు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఎం),. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లైనిస్ట్)లిబరేషన్,. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లినినిస్ట్)న్యూ డెమోక్రసీ,. ఆర్‌సిపి, ఆర్ఎంపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ సంయుక్తంగా "ప్రపంచ శాంతి"ని కాంక్షిస్తూ, అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ "నిరసన" కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అమెరికా ప్రపంచంపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన 104 యుద్ధాలు అమెరికా ఆర్మీ మారునాయుదాల వ్యాపార లాభాల కోసం ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించినవేనని వారు విమర్శించారు. ఒకవైపు ప్రపంచాన్ని ఉద్ధరించే వ్యాఖ్యలు చెప్పుతూ, మరోవైపు ప్రపంచంలో అనేక దేశాలలోని అత్యంత అరుదైన, విలువైన, నిక్షేపాలను, గనులను, ఆయిల్ ను, గ్యాస్ ను, దోపిడీ చేస్తోందన్నారు. నేడు ప్రపంచంలో జరుగుతున్న పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం, ఇరాన్ పై ఇజ్రాయిల్,అమెరికా చేస్తున్న దాడులు, రష్యాపై ఉక్రెను ఉసిగొలుపుతున్న యుద్ధం, చైనాపై తైవాన్ ను రెచ్చగొడుతున్న ఉద్రిక్తతలు, ఉత్తర కొరియా దక్షిణ కొరియాల మధ్య ప్రేరేపిస్తున్న యుద్ధమేఘాలు అమెరికా ప్రేరేపితాలేనని వారు గుర్తు చేశారు. అమెరికా స్వార్థపూరిత ఆయుధ వ్యాపార సైనిక కుట్రలను ప్రపంచం ముందు బహిర్గతం చేస్తున్న కమ్యూనిస్టు దేశాలను, అమెరికా తన మిత్ర దేశాలతో కలిసి అష్టదిగ్బంధం చేయటానికి ప్రయత్నిస్తోందని, ప్రజా అనుకూల ప్రభుత్వాలైన కమ్యూనిస్టు దేశాలు పోరాడుతున్నాయని వారు గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసి.బాదుల్లా మాట్లాడుతూ... అమెరికా దుర్మార్గాలకు, ఇజ్రాయిల్ దురాక్రమణలకు హద్దు పద్దు లేకుండా పోయిందని, వారిని ప్రశ్నించే దేశాలపై ఉగ్రవాదం ప్రేరేపిస్తున్నాయని తప్పుడు నిందలు వేసి, వారి వద్ద అనువాయుధాలు తయారీ చేస్తున్నారని నెపం మోపి ఆ దేశాల ప్రజలను చంపుతున్నారని, భౌగోళికంగా అక్కడ అభివృద్ధిని నాశనం చేస్తున్నారని వీరిపై ప్రపంచవ్యాప్తంగా ప్రజా నిరసనలు వస్తున్నాయని గుర్తు చేశారు. సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బి.ఓబయ్య మాట్లాడుతూ... అమెరికా దుశ్చర్యలను అమెరికా ప్రజలు అమెరికా సైన్యం హర్షించడం లేదని అయినా అమెరికా పాలకుల వైఖరిలో మార్పు రావడం లేదన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా అంతర్జాతీయ పోలీసుగా తన్ను తాను ప్రకటించుకొని దుర్మార్గాలకు పాల్పడుతోందని ప్రశ్నించారు. ఆర్ఎస్‌పి జిల్లా కార్యదర్శి కె.సుబ్బరాయుడు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ దేశ అలీన విదేశాంగ విధానాన్ని విస్మరించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపం చేస్తున్నారని మన దేశ దీర్ఘకాలిక మిత్రుడైన రష్యాపై ఉక్రెయిన్ ను అమెరికా రెచ్చగొట్టి యుద్ధం చేపిస్తూ ఉంటే అమెరికా శకుని నీతిని ప్రశ్నించకుండా దాటవేస్తోందన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, ఆర్ఎంపిఐ జిల్లా కార్యదర్శి జి.రమణయ్య మాట్లాడుతూ.. పాలస్తీనా ఇరాన్లపై అమెరికా ఇజ్రాయిల్ దాడులు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, ఆర్ఎంపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్ ఎ.అన్వేష్, కే.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, సావంత్ సుధాకర్, మునయ్య, గౌస్, భాగ్యలక్ష్మి నాయక్ నారాయణ గోపి, నరసింహ, నాగరాజు, కమ్యూనిస్టు అభిమానులు డాక్టర్ గోపాల్, శివారెడ్డి, వామపక్ష ప్రజాసంఘాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

వరి పంటపై రైతులకు విశ్లేషణ

విశాలాంధ్ర-చెన్నూరు: వరి పంటపై రైతులకు అవగాహన కల్పించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొక్కరాయిపల్లి ,చెన్నూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య రైతులకు వరి పంటలోని నాణ్యమైన రకాలు వాటి యాజమాన్యం గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా వరి మినీ కిట్స్ రైతులకు సరఫరా చేయడం జరిగింది. మం డల వ్యవసాయ అధికారిని శ్రీదేవి మాట్లాడు తూ మినుము విబిఎన్ 7రకము, జొన్న సిఎస్‌వి 41రకము మినీ కిట్లు ఈ ఖరీఫ్ సీజన్లో సరఫరా చేయబడునని తెలియజే శారు. ఏఈఓ సుధీర్ కుమార్, వీఏఏలు చరణ్ కుమార్, రెడ్డినాగేశ్వరి, సలోమి, ఎంపీ ఈవో లక్ష్మి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: మాదకద్రవ్యాల అలవాటు వల్ల యువత ప్రమాదకరమైన జబ్బుల పాలై వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని రిమ్స్ క్లినికల్ సైకాలజిస్ట్ భాస్కర్ అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఏదో ఒక రకమైన డ్రగ్స్ కి అలవాటు పడి ఉన్నారని వాటిని మానుకొని ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని అన్నారు. కడప పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి వాటితో మతిస్థిమితం కోల్పోతున్నారని అన్నారు. బుధవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల నిరోధకత పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ నేడు మత్తు పదార్థాలు సేవించే వారిలో 15 నుంచి 50 సంవత్సరాల వయస్సులోపు వారే అధికంగా ఉండటం విచారకరమని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు వల్ల వారి విలువైన భవిష్యత్తును కోల్పోతారని అన్నారు. ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్లు కెప్టెన్. డాక్టర్.నీలయ్య డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థుల చదువుతోపాటు వారి నడవడిక, అలవాట్లు, స్నేహాలు గమనిస్తూ ఉండాలని అన్నారు. అంతేకాకుండా మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలకు ఆవోపా తరపున ప్రింటర్ వితరణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అవసరంఅని డిఇఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం అవోపా ఆర్యవైశ్య అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ద్వారా ఉర్దూ పాఠశాలకు ఆవోపా తరపున ప్రింటర్ వితరణ చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఎంతో అవసరమని దాని అనుగుణంగా ద్వారా ఆవోపా సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేసేందుకు దాతలు ముందుకు రావాలని పెలుపునిచ్చారు. సభ్యులు ఆకుల సత్యప్రసాద్ గారు వారి తండ్రి ఆకుల వెంకట పాపయ్య పూర్వపు ప్రధానోపాధ్యాయులు నగర పాలక ఉర్దూ మెయిన్ ఉన్నత పాఠశాల వారి జ్ఞాపకార్థం డిప్యూటీ డిఓ రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

"బొల్లి మచ్చలు" అంటు వ్యాధి కాదు

విశాలాంధ్ర-కడప: బొల్లి మచ్చలు అనేవి ఒకరినుండి ఒకరికి సంక్రమించే అంటూ వ్యాధి కాదని జిజిహెచ్(రిమ్స్) డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ విటిలిగో డే (బొల్లి మచ్చ దినోత్సవం) సందర్భంగా బుధవారం కడప జిజిహెచ్ లోని చర్మ వ్యాధుల (డెర్మటాలజీ) విభాగంలో సంబంధిత హెచ్ఓడి డా.పెంచలయ్య ఆధ్వర్యంలో.. బొల్లి మచ్చలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లి మచ్చలు అనేవి ఒకరి నుండి ఇంకొకరికి సంక్రమించే జబ్బు కాదని, వంశపారపర్యంగా కూడా వచ్చే వ్యాధి రాదని, వివాహానికి బొల్లి వ్యాధి ఎలాంటి అడ్డుకాదని వివరించారు. బొల్లి మచ్చల వలన ఒక వ్యక్తి శారీరక, మానసిక సౌరర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటోబోదన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. కావట్టి తెల్ల మచ్చలు, బొల్లితో ఉన్న వారి పట్ల వివక్షతను చూపకుండా.. సమాజంలో అందరితో సమానంగా ఆధరించాలన్నారు. వారిని అందరితో కలివిడిగా ఉండేలా మానసిక ధైర్యాన్నిచ్చి చికిత్స చేయించేందుకు సహకరించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం వైద్యులు డా. సుభాషిణి, డా. నరోత్తమరెడ్డి, డా. విజయ కుమారి, డా.షాలిని, పిజి వైద్యులు, మిగతా వైదులు తదితరులు పాల్గొని అవగాహన పెంపొందించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- ఎంపీపీ వీరనారాయణరెడ్డి

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని పరిధిలోనే గ్రామాల వారిగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా శాఖల వారీగా అధికారులు దృష్టి పెట్టాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన మైదుకూరు మార్కెట్ చైర్మన్, ఏపీ రవీంద్ర హాజరయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షు వహించిన, మండల పరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో 14 సచివాలయంలో వారిగా గ్రామ సమస్యలను పరిష్కరించి గ్రామాలలో తాగునీటి సమస్యలు పరిశుద్ధ పనులు ముఖ్యంగా దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు అదేవిధంగా బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ప్రజలు దృష్టి పెట్టాలని ఆయన అన్నారు మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆయన మండల అభివృద్ధి కోసం శ్రీకారం చూస్తున్నారని దేవస్థానం అభివృద్ధి కోసం ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని సిద్దయ్య గారి మఠం కూడా అభివృద్ధి చేశారన్నారు. గ్రామాలతో పాటు ప్రజా సమస్యల పైన కూడా దృష్టి పెడుతున్నారని, ఈ ప్రాంత ప్రజలు మఠం మార్కెట్ యార్డ్ నియమించాలని అడుగుతున్నారని సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు, ఇన్చార్జ్ ఎంపీడీవో వీరకిషోర్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి కి కార్యదర్శులు సర్పంచులు కృషి చేయాలని పారిశుద్ధం పనులు పైన అధికారులుగా దృష్టి పెడతామని అన్నారు, ఈ కార్యక్రమంలో బి.మఠం ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-సంబేపల్లె: విద్యార్థుల భవిష్యత్తు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చప్పిడి పద్మజ తెలిపారు. పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే సమాజంలో వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైనదని అందుకు అనుగుణంగా బోధన చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుధారాణి, రామలింగారెడ్డి లను దుశ్శాలువులతో, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెంచలమ్మ, అమర్నాథరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి రామచా అన్నారు.బుధవారం మండలంలోని చింతపర్తి పీహెచ్సీ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్, మలేరియా వ్యా తీరును పరిశీలించారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తత చేయాలని ఆదేశించారు మలేరియా వ్యాప్తి, నివారణపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలికిరి యూనిటు అధికారి ముజీబ్, బావుద్దీన్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-సంబేపల్లె:పాలెంగడ్డ పాపన్నగారిపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాత ప్రకాష్ పేద విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రెడ్డప్ప రెడ్డితో కలిసి అందజేశారు. దాత ప్రకాష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పేదవారికి తమ సంస్థ తరఫున సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటామన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పెన్సిల్లు అందజేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజులు, నాగిరెడ్డి, అన్నయ్య, శ్రీకాంత్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, సెక్రెటరీ శశి శేఖర్, సభ్యులు నరసింహా, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీకి విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-రామసముద్రం: మండలంలోని చెంబకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉప్పలపాటి కీర్తన రెడ్డిపల్లి భువనేశ్వరి ఇడుపులపాయ ఐఐటీకి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు రమేష్ బాబు తెలిపారు వీరిని పలువురు అభినందించారు

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని కట్టడి చేయడంలో విఫలమైన అధికారులు

విశాలాంధ్ర - బద్వేలు : పట్టణం తో పాటు నియోజకవర్గం లో వున్న కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విపలమయ్యారని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దుళ్ళపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూపాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు,యూనిఫామ్,అడ్మిషన్ తదితర ఫీజులతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ విద్యార్థులు కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేలు పట్టణం లోని నారాయణ,శ్రీచైతన్య,ఫాతిమా, ఏ వీ అర్ మిగతా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్కులు 7000 లకు యూనిఫాములకు 5000పైగా అమ్ముతూ విద్యను వ్యాపారంగా మలచి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థలపై తక్షణమే తనిఖీలు నిర్వహించి ఆ పాఠశాలల గుర్తింపు ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.బద్వేలు నియోజకవర్గం లోని బద్వేలు, పోరుమామిళ్ళ పట్టణాల్లో ఉన్న అన్ని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారులు ఉక్కుపాదం మోపి విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు బాసటగా నిలవాలని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు, స్కూలు ఫీజుల నియంత్రణ చేయకపోతే ఎఐఎస్ఎఫ్, ఏఐవైయఫ్ అధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయాలు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైయఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వరికుంట్ల శ్రీను,బద్వేలు పట్టణ కార్యదర్శి మధు,జిల్లా సమితి సభ్యులు రామకృష్ణ, సుధాకర్, సుజన్, ఓబులేసు లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రామసముద్రం : గడచిన శనివారం మండలంలోని చెంబకూరు పంచాయతీ బలిజపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనరసమ్మ మృతి చెందగా కృష్ణమ్మ శ్రీనివాసులు గాయపడ్డారు దీంతో క్షతగాత్రులను ప్రైవేటు వైద్యశాలల్లో తీసుకెళ్లి చికిత్సలు చేయించారు అయినా కానీ శ్రీనివాసులు(55) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు కృష్ణమ్మ పరిస్థితి విషమంగానే ఉందని పేర్కొన్నారు ప్రమాదంలో ఇద్దరు చనిపోవడం తీవ్ర విషాదంగా మారింది ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు

విశాలాంధ్ర - పీలేరు :ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందివ్వడం జరుగుతుందని పీలేరు మండల రెవిన్యూ అధికారి శివ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ -పీలేరు మండలము నందు 65 సంవత్సరములు పూర్తి అయిన వయోవృద్ధులు, మరియు వికలాంగులకు ప్రభుత్వము వారు ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు చౌక దుకాణ డీలర్లు ద్వారా జూలై నెల సరుకులు 26 న నుండి 30 లోపు పంపిణీచేయడం జరిగిందని తెలిపారు.ఈ విషయమై సంబంధిత సచివాలయ సిబ్బంది, రేషను డీలర్ల తో సమావేశము నిర్వహించి తగు సూచనలు జారీ చేయడమైనదని తెలిపారు.. ఈ సమావేశంలో తహసీల్దారు శివ కుమార్, విజయ్ కుమార్, చౌక దుకాణ డీలర్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన

విశాలాంధ్ర- పీలేరు : పీఎం సూర్య పథకం పై పీలేరు డివిజన్ లో 10, 000 మందికి అవగాహన కల్పిస్తున్నట్లు సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. పీలేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిఎన్ఆర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పీఎం సూర్య ఘర్ పథకం పై అవగాహన కల్పించారు. ఈ పథకము ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ ఓసీ వినియోగదారులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుంది అనే విషయంపై విద్యార్థులకు వివరించడం జరిగింది. రెండవ సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి విద్యార్థి సుమారు 60 మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా ఈ పథకాన్ని విస్తృత స్థాయిలో ప్రచారాన్ని కల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ లు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, డివిఎంసి సభ్యులు బోధి షావలి, విద్యుత్ శాఖ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

టైలరింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన కమిషనర్

విశాలాంధ్ర - బద్వేలు : పట్టణంలోనియస్.బి.వి.ఆర్ కళాశాల నందు టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ను తనఖీ చేసి ట్రైనింగ్ జరుగు విధానం ను పరిశీలించారుబద్వేల్ పురపాలక సంఘం నందు సుమారు 1500 మంది టైలరింగ్ శిక్షణ కు ఆన్లైన్ లో నమోదు చేసుకున్నారనీ మొదట విడతగా 250 మందికి శిక్షణ వచ్చే నెల చివరకి పూర్తి అవుతుంది.వారందరు కూడా ఉచిత మిషన్ కోసం కాకుండా టైలరింగ్ పైన శ్రద్ధతో నేర్చుకుంటున్నారన్నారు. తొందర్లో కోటవీధి లో గల బాలికల ఉన్నత పాఠశాల నందు బి సి కార్పొరేషన్ ఈడి మరో సెంటర్ ప్రారంభించడంకోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రికార్డ్స్ బయోమెట్రిక్ హాజరు వివరాలు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు

కార్యకర్తలకు నాయకులకు పార్టీలో గుర్తింపు

విశాలాంధ్ర-వాల్మీకిపురం: కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు తెదేపాలోనే గుర్తింపు సాధ్యమని నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల పార్టీ అధ్యక్షుడుమల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెటు కమిటీ కార్యాలయ సమావేశ భవనంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి మల్లికార్జునరెడ్డికి శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున మైనార్టీ నాయకులు, భాజపా నాయకులు, తెదేపా నాయకులు హాజరై మల్లికార్జునరెడ్డికి అభినందనలు తెలియజేశారు. దేశంలో కార్యకర్తలకు, నాయకులకు ఏ పార్టీ లేని గుర్తింపు తెదేపాలో లభిస్తోందని, తెదేపాలో కార్యకర్తగా, నాయకులుగా ఉండి కష్టపడితే పదవులు వాటికంతటకు అవే వరిస్తాయని మాజీ సర్పంచి రాజేంద్రచారి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి, తెదేపా నాయకులు సయ్యద్బాషా, డిష్ బ్రదర్స్, కొవైటు బాబు, రామకృష్ణ, ఆదినారాయణ, భాజపానాయకులు జాకీర్, విష్ణుచైతన్య పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం కోసం పనిచేయండి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ఎక్కువ కేసులు పరిష్కారమే లక్ష్యంగా న్యాయవాదులు పని చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ అన్నారు. జూలై 5వ తేది జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న దృష్ట్యా బుధవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్పై న్యాయవాదులకు అవగాన సదస్సు నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి జడ్జిగురు అరవింద్ మాట్లాడుతూ రాజీ మార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే దిశగా న్యాయవాదులు కక్షిదారుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బార్అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందకుమార్, న్యాయవాదులు ద్వారకనాథరెడ్డి, రవికుమార్, అశోక్ కుమార్రెడ్డి, రమణ, పాల్రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, తనయులు సాయివికాస్ రెడ్డి పేర్కొన్నారు.సిఎం సహాయ నిధి నుండి మంజూరు అయిన చెక్ లను తీసుకుని బుధవారం ఉదయం భాదితుల నివాసాలకు వెళ్లి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.కోడూరు మండలంలో కోడూరు టౌన్ లోని జగడంపల్లికి చెందిన కస్తూరి సుబ్బరాయుడు కు 59,520 వేల రూపాయలు,సూర్యనగర్ కు చెందిన సంగరాజు మంజుల కు 66,713 వేల రూపాయలు,న్యూక్రిష్ణానగర్ కు చెందిన ఇరగబోయిన సుహాసిని కి 30,786 వేల రూపాయలు,ఒంటెలనగర్ కు చెందిన పిడుగు జయలక్ష్మి కి 37,205 వేల రూపాయలు,గాండ్లవీధికి చెందిన కానగల సాయినరసింహకు 70,000 వేల రూపాయలు, మైసూరువారిపల్లి గ్రామానికి చెందిన పగడాల సుబ్బయ్య కు 30,000 రూపాయలు జనసేనపార్టీ కార్యాలయంలో, శెట్టిగుంట గ్రామానికి చెందిన కోలా శ్రీనివాసులు కు 1,20,843 రూపాయలు, అనంతరాజుపేట గ్రామానికి చెందిన కడప చలపతి కి 35,000 వేల రూపాయల చెక్ లను అందజేసి వారిలో సంతోషాన్ని నింపి మానవత్వాన్ని చాటుకున్నారు.మొత్తం 8 మందికి 4,50,067 రూపాయలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరంగా ఆర్థిక ఇబ్బందులు పడేవారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా ఉమాదేవి, గంగరాజు పుష్పలత,తాతంశెట్టి నాగేంద్ర,పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, రాహుల్ రెడ్డి, జోగినేని మణి, సర్పంచ్ కారుమంచి సంయుక్త ,పిసిఎన్ బ్రదర్స్ పగడాల చంద్రశేఖర్, వెంకటేష్,ముత్యాల కిషోర్ కుమార్, ఉత్తరాది శివకుమార్,పోకల మణి, ఉడుం శివకుమార్ రెడ్డి, కొప్పరపు అరవింద్,కస్తూరి మోహనకృష్ణ, చంద్రశేఖర్ రాజు,సాలాపక్షి చంద్రశేఖర్, కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

హజ్ యాత్రను దిగ్విజయంగా ముగించిన వారికి

బెంగళూరులో స్వాగతం పలికిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- మదనపల్లె : ముస్లిం మైనార్టీలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్రను దిగ్విజయంగా ముగించుకుని హాజీలు తిరిగి బుధవారం తెల్లవారు జామున బెంగళూరు ఎయిర్ పోర్టు కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హాజీలకు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఘనస్వాగతం పలికి వారికి ప్రత్యేకంగా విందును ఏర్పాటు చేశారు. హజ్ యాత్ర శుభప్రదంగా ముగిసిందని హాజీలు తెలిపారు. భవిష్యత్తులో హజ్ యాత్రకు మరింత విస్తృతమైన ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాసన్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, మెంబర్లు పాల్గొన్నారు.

బీసీ ల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

బిసిహెచ్ పియస్ అధ్యక్షులు బోడెం రాజశేఖర్

విశాలాంధ్ర-మదనపల్లె : ఈ నెల 29న మార్కెట్ యార్డ్ మహాత్మాజ్యోతి రావు పూలే విగ్రహం నుండి శ్రీకృష్ణ కల్యాణ మండపం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్ ప్రకటించారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీకృష్ణ కల్యాణ మండపం నందు బిసిల ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్.డి.ఏ కూటమి గెలుపునకు బిసి హక్కుల పోరాట సమితి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు ఎంత మేర అమల్లోకి వచ్చాయో, ఇంకనూ అమలు చేయాల్సిన హామీలు, బీసీలు సాధించుకోవాల్సిన డిమాండ్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున ఈ ముఖ్య సమావేశానికి మదనపల్లె, అన్నమయ్య జిల్లా నలువైపుల నుండి బిసిలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా భవిష్యత్తు కార్యాచరణపైన సమీక్ష జరుగుతుందని తెలిపారు. బీసీ హక్కుల పోరాట సమితి ఆవిర్భవించి 17 ఏళ్లు అవుతోందని, ఇప్పటి వరకు తనతో కలసి ప్రయాణం చేస్తున్న కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బీసీ హక్కుల పోరాట సమితి బీసీల భవిష్యత్తుకే పరిమితం కాకుండా ప్రజాపయోగ కార్యక్రమాలను చేపట్టే విధంగా ముందడుగు వేయనున్నామని స్పష్టం చేశారు. మదనపల్లెలో ప్రైవేట్ ఆసుపత్రులు రోగులను దోచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాగే జిల్లా ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందడం లేదని ఈ విషయంపై క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను ప్రజలు ముందు ఉంచుతామని ప్రకటించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ఎమ్మెల్యే స్పందించి పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించకుండా దొడ్డిదారిలో అమలు చేసే పనులకు స్వస్తి పలకలన్నారు.ఈ కార్యక్రమంలో బిసిహెచ్ పిఎస్ నాయకులు సి.రామలింగయ్య, చిన్న రెడ్డప్ప, కరమత్ బాషా, మళ్లేపల్లె సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, రామకృష్ణ, అమరనాథ్, సుబ్బరాజు, నాగేంద్ర, ప్రసాద్, రాజా, నారాయణస్వామి, ఆర్.సహదేవ పాల్గొన్నారు.

ప్రమాద భీమాతో బాధిత జీవితాల్లో వెలుగులు

బాధితురాలికి రూ.10 లక్షలు చెక్కు అందజేత

విశాలాంధ్ర-వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్, ప్రమాదభీమా చేయించుకోవాలని, ముఖ్యంగా మహిళలు తెలివితో అలోచించి కుటుంబ యజమానులపై (ప్రమాద భీమా) ఇన్సూరెన్స్ చేసుకోవడం వలన భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎస్బీఐ చీఫ్ మేనేజర్ సురేంద్ర అన్నారు. మండలానికి చెందిన మహిళా గ్రూపు సభ్యురాలు లక్ష్మీదేవి వ్యవసాయకూలిగా ఉందన్నారు. మహిళా సంఘాల ద్వారా తన భర్త మహేష్ బాబుపై గతంలో రూ.500 చెల్లించి ప్రమాధ భీమా చేయించుకుందన్నారు. ఇటీవల ఈమె భర్త మహేష్ బాబు ప్రమాదపు శాత్తు చనిపోయాడని తెలిపారు. దీంతో లక్ష్మీదేవి కుటుంబం ఇంటి యజమానిని కోల్పవడంతో పాటు దిక్కులేని వారయ్యారన్నారు. లక్ష్మీదేవి అవగాహనతో గతంలో రూ.500 ఇన్సూరెన్స్ కట్టడం వలన ఈ రోజు బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ క్లైమ్ అయిందని, రూ.10 లక్షల నగదును బాధితురాలకి అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒకరూ విజ్ఞతతో, అవగాహనతో ముందుకెళ్లాలని, ప్రతి ఒకరికి జీవితంపై ముందుచూపు అవసరమన్నారు. తదుపరి చెక్కును బాధితురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ బ్రాంచి మేనేజర్, చైతన్య, బ్యాంకు అధికారులు శరత్, విశ్వ, ఏపీఎం సరోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జులై 9 సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని,10 గంటల పని విధానం స్వస్తి పలకాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ తదితర డిమాండ్ల సాధనకు జులై 9న జరగనున్న దేశవ్యాపిత సమ్మెలో పాల్గొనున్నట్లు ఈ మేరకు కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డికి బుధవారం సమ్మె నోటీసు అందించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా అధ్యక్ష,కార్యదర్శులు నరసింహులు తారక రామారావు తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఆప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని కోరారు. 12వ పిఆర్సి వెంటనే నియమించాలని, కార్మికులకు జిఓ 1615 అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి వెంకటాద్రి నాయకులు జనార్ధన రాజశేఖర్ చంద్ర పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు - ఆరోగ్యమే ముద్దు

బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాసా ముక్త్ భారత్

విశాలాంధ్ర-మదనపల్లె : స్థానిక చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాసా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థి ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు.కళాశాల ఎన్.సి.సి సిటిఓ డాక్టర్ జి. చిన్నారెడ్డి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఆనందరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందని,అందువలన విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి, డిగ్రీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాఘవరెడ్డి,కళాశాల అధ్యాపకులు,డాక్టర్ డి.శ్రీనివాసులు తదితరులు విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందనిజీవితాన్ని నాశనం చేస్తుందని వివరించారు. అందువల్ల విద్యార్థులు వాటి వినియోగానికి దూరంగా ఉండాలని ఉద్బోధించారు.అనంతరం మాదకద్రవ్యాలు వద్దు - ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ కళాశాల విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర- బద్వేలు : పట్టణం లోని మహబూబ్ నగర్ లో వున్న జిల్లాపరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యాసంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన మొదటి,రెండవ,మూడవ శ్రేణి మార్కులు సాధించిన ముగ్గరు విద్యార్థినులకు బద్వేలు పట్టణ ఆవాజ్ కమిటి అధ్యక్షులు ఎస్.ఎ సత్తార్ కౌన్సిలర్ మహమ్మద్ హసన్,వార్డు ఇన్చార్జి మహమ్మద్ హుసేన్ (కాట్రాజ్),మరియు స్కూల్ కమిటీ ఛేర్మెన్ రంతుబాష వారి ఆర్థిక సహకారంతో ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు,పెన్నులు,నోట్ పుస్తకాలు,బ్యాగులు బహుమతి గా అందచేశారు. .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యస్.మహబూబ్ బాష (బిగ్ బాస్) పాల్గొని విద్యార్థులను ప్రశంసించారు ఈ సందర్భంగామాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించినందుకు విద్యార్థినులను, ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయినులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యస్.అన్వర్ బాష, జిల్లా అధ్యక్షులు చాంద్ బాష,సభ్యులు మస్తానయ్య, మహమ్మద్ ఆలి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయ ఉపాధ్యాయినులు,విద్యార్థినీ విద్యార్థులు హాజరైనారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

యువకుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- మద నపల్లె : గుర్తు తెలి యని వాహనం ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధ వారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు వలసపల్లి గ్రామం అరవ వాండ్లపల్లెకు చెందిన జి శివయ్య(30) పుంగనూరు రోడ్డు, 150 మైలు వద్దకు నడచి వెళుతుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాధితున్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్పి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలు కుంటున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడు ఆత్మహత్యా యత్నం

విశాలాంధ్ర- మదనపల్లె : కుటుంబ సమస్యలతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చెర్లోపల్లి కి చెందిన ఆదినారాయణ కుమారుడు మణికంఠ (20) కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవ పడ్డాడు. తల్లిదండ్రులు మందిలించడంతో తీవ్ర మనస్థాపానికి గురై, టమోటా చెట్లకు కొట్టేందుకు తెచ్చి ఉంచిన పురుగులమందు ఇంట్లో ఉండడంతో దానిని తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు బాధితుడిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-రాజంపేట: స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు ఎం.మధుకు ఇటీవల జేఎన్టీయూ అనంతపూర్ విశ్వ విద్యాలయం వారు డాక్టరేట్ ప్రధానం చేసినట్టు కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి తెలిపారు. మధు సుమారు 15 సంవత్సరాల నుంచి ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ అనాలసిస్ విభాగంలో వివిధ రకాల స్థాయి నుంచి ప్రస్తుతం హెచ్వోడిగా సేవలందిస్తు న్నారని, వీరు తన పీహెచ్డీ పరిశోధన "డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ యు.పి.ఎల్.సి మెథడ్స్ ఫర్ క్వాంటిటేటివ్ ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ అండ్ డోసేజ్ ఫార్మ్స్" అన్న అంశంపై పరిశోధన నిర్వహించి ఈ డాక్టరేట్ అర్హతను పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్ర రెడ్డి డాక్టరేట్ పొందినందుకు మధును ప్రశంసించారు.

వయోవృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల పరిధిలోని తహసిల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశాన్ని తాసిల్దార్ మహబూబ్ చాంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని చౌక దుకాణాల కేంద్రంలోని డీలర్లు అందరూ 26న, 65 సంవత్సరములు పైబడిన వయోవృద్ధులకు, వికలాంగులకు, నడవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపకం చేయాలని తెలియజేశారు. పోయిన నెల ఒకటో తారీకు నుండి వృద్ధులకు వికలాంగులకు డీలర్లు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయడం జరిగింది అయితే ఈ నెల నుంచి ముందుగానే 26వ తారీకు నుండి 30 తారీఖు వరకు వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపకం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వినీత్ కుమార్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జ్యోతిర్మయి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యం యొక్క చీకటి శకం

చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేటలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం కళాశాలలో ప్రిన్సి పల్ పురుషోత్తమ అధ్యక్షతన సెమినార్ నిర్వహిం చారు ఈ సెమినార్ కి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లా డుతూ 1975 జూన్ 25న భారతదేశంలో అత్య వసర పరిస్థితి విధించబడింది ఇది ప్రజాస్వామ్యంపై అతి పెద్ద దాడి అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అన్ని ప్రాథమిక హక్కులు నిలిపివేయడం ప్రెస్ పై సెన్సార్ విధిం చడం ప్రతిపక్ష నాయకులను జైల్లో బంధించడం మరియు దేశంలో అన్ని ప్రజాస్వామ్య స్వరాలను అణిచివేసే ప్రయత్నాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చడానికి ఎత్తించి నేటికి 50 సంవత్సరాలు పూర్తయినాయి. భావితరాలందరికి కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందిస్తే అటువంటి గొప్ప రాజ్యాంగాన్ని కూడా తూట్లు పొడుస్తూ దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 21 నెలలు దేశంలో అత్యవసర పరిస్థితి విధించడం జరిగింది. ఇది కేవలం ఇందిరా గాంధీని అలహాబాద్ హైకోర్టు ఎంపీగా మీరు అనర్హులు గా గుర్తించడం వలన తన పదవి పోతుందని పదవీకాంక్షతో ఎమర్జెన్సీ ప్రకటించి దేశాన్ని 21 నెలలు చీకటి లో పాలన సాగించడం జరిగింది. ఒక అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా మూడు లక్షల మంది పైగా జైలు పాలయ్యారు . ఆర్ఎస్ఎస్ పైన నిషేధం విధించారు. అన్ని పత్రిక సంపాదకులు తమ ఆధీనంలోకి తీసుకొని వారు చెప్పిందే శాసనంగా నడుచుకున్నారు 30 వేల మంది పైగా కఠినమైన మీసా కింద జైలు పాలయ్యారు. దేశంలో పౌరుల యొక్క హక్కులను పూర్తిగా కాల రాశారు అటువంటి చీకటి రోజులు మళ్లీ రాకూడదని భావితరాలకు ఆనాడు జరిగిన సంఘటనని వివరించడానికి ఈ సెమినార్ అని వారన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నర్సయ్య బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగల ఆదినారాయణ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గ సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు శ్రీనివాస్ కళ్యాణమండపంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డిఓ చంద్రమోహన్, పలువురు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు.హాజరైన మైదుకూరు నియోజకవర్గం లోని ఐదు మండలాల అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు,ప్రజలు.నియోజకవర్గంలోని సమస్యలను జిల్లాస్థాయి అధికారులకు విన్నవించిన నాయకులు ప్రజలు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు.నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ ప్రజలు త్రాగునీరు సాగునీరు అవసరాల కోసం రెండు కార్ల పంటలు పండించుకోవడానికి అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను త్వరితగతిన పూర్తి చేయడానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అభివృద్ధికి అవసరమయ్యే 36 కోట్లను ఆర్థిక శాఖ నుండి ఆమోద పొందడానికి కృషి చేస్తానని తెలిపారు.బ్రహ్మంగారిమఠంలో జవహర్ నవోదయ విద్యా కేంద్రాన్ని స్థాపించడం ఆనందదాయకం అన్నారు.నియోజకవర్గంలో స్మశానాలను ఐదు కోట్లతో అభివృద్ధి చేశాం నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు ప్రజల సమస్యలను తీర్చడంలో అలసత్వం వహించడం పై కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పుట్టా కేసీ కెనాల్ నుండి నీరు విడుదల కానుండడంతో ఎన్హెచ్67 పనులను త్వరితగతిన చేయాలని కోరిన ఎమ్మెల్యే సరస్వతి పేట వద్ద కృష్ణాపురం ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల నిర్లక్ష్యాన్ని డి ఎం హెచ్ ఓ కు తెలియజేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే.నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు అందరూ సహకరించాలని కోరిన ఎమ్మెల్యే పట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ శ్రీధర్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ వివిధ శాఖల ద్వారా రైతులకు వివిధ రకాల సబ్సిడీ ల గురించి తెలియజేసిన అధికారులు నాలుగు ఎకరాలు సాగుబడి చేస్తే వచ్చే ఆదాయం నాలుగు బర్రెలను పెంచుకోవడం వలన కూడా పొందవచ్చని తెలిపిన కలెక్టర్.రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపాలని కోరిన జిల్లా కలెక్టర్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కృష్ణాపురం ఆరోగ్య కేంద్రంకు సంబంధించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న డిఎంహెచ్వో తెలిపారు. సమావేశంలో అధికారులు టిడిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్సిపి విస్తృతస్థాయి సమావేశం

హాజరైన మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్

విశాలాంధ్ర-మదనపల్లె : విజయవాడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పార్టీ ఇన్ఛార్జిలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ నిర్వహించే కార్యక్రమాలు,పార్టీ బలోపేతం చేయడానికి తీసుకోవాలసిన చర్యలు, కూటమి ప్రభుత్వ వైఫల్యపైన చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మదనపల్లె నియోజకవర్గం వైకాపా పార్టీ ఇంచార్జ్ నిస్సార్ అహ్మద్, పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి,అన్నమయ్య జిల్లా వైకాపా అధ్యక్షులు అకేపాటి అమరనాథ్ రెడ్డి లు పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజంపేట టీడీపీ ఇన్చార్జ్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం ను మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అభినందించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. జగన్మోహన్ రెడ్డికి పూలబోకెని సుగవాసి బాలసుబ్రహ్మణ్యం అందజేశారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో వైఎస్సార్సీపీని దృఢంగా తయారు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, అన్నమయ్య జిల్లా పార్టీ శ్రేణులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను అభినందించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహ్మద్ విస్తృత స్థాయి సమావేశానికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఇన్చార్జులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని, అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచనలు మేరకు నూతన ఉత్సాహంతో పనిచేసి వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

యల్లటూరు శ్రీనివాసరాజు

విశాలాంధ్ర-రాజంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. పట్టణంలోని మన్నూరు జెట్పీ హై స్కూల్లో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు పి.పరిమళ మరియు ఉపాధ్యాయుల ఆద్వర్యంలో సర్వేపల్లి విద్యామిత్ర కిట్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిధులుగా యల్లటూరు శ్రీనివాస రాజు పాల్గొని విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధిస్తున్నాయని, ఈ మధ్య ఇదే పాఠశాలలో పదవతరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాద్యాయులకు ఆయన అభినందనలు తెలుపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలలకు కావలసిన అన్ని వసతులను సమకూరుస్తుందని, సర్వేపల్లి విద్యామిత్ర కార్యక్రమానికి సర్వేపల్లి రాధాకృష్ణ పేరు పెట్టడం ద్వారా రాజకీయాలకు అతీతంగా దేశనాయకులను గౌరవించుకోవడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేష్ లు చూపిస్తున్న చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాద్యమంలో బోధించడం ద్వారా పిల్లల్లో మెరుగైన ఆలోచనలు కలుగజేసే విధంగా ఈ కార్యక్రమం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అనుమలగుండం నాగరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, పట్టణ నాయకులు మావిళ్ళ రవి, జనసేన మండల నాయకులు కోలాటం హరికృష్ణ , మన్నూరు నీటి సంఘం అధ్యక్షులు నారదాసు రామచంద్ర, ఊటుకూరు పంచాయతీ నాయకులు పడకాల సుధాకర్ రాయల్, మామిళ్ల మల్లి, నారామణి, తోట బుజ్జి, వజ్రా నరసింహులు, నారదాసు మధు, పలుకూరి శంకర్, పూల మురళి, నార బోయిన ప్రసాద్, లక్ష్మీపతి రాజు, గూడూరు శ్రీనివాసులు, శివశంకర్ రాజు, గాజుల కులాయప్ప, తిప్పాయపల్లె ప్రశాంత్, మౌల తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు పాటించాలి: ఏఓ సుధాకర్

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: వ్యవసాయ రైతులు వరి పంట సాగులో కాలి బాటలు పాటించడం వలన తెగుళ్ల ఉధృతి తగ్గి పోతుందని చిట్వేల్ మండల వ్యవసాయ అధికారి జి సుధాకర్ పేర్కొన్నారు.బుధవారం చిట్వేల్ మండలంలోని సిఎం రాచపల్లి,నాగవరం వడ్డిపల్లి గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎఓ మాట్లాడుతూ చీడపీడలు తగ్గించడానికి ప్రతి రైతు పంట మార్పిడిని చేపట్టాలన్నారు.దుక్కిలో ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ వేయడం వలన అధిక దిగుబడులు సాధించ వచ్చున్నారు.వరి నాటే సమయంలో నారు కొసలు తుంచి వేసి నాటడం వలన కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. బొప్పాయి పంటలో పూత రాలడం తగ్గించడానికి 13-0-45 మందు 10 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు సలహాలు పాటించి పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు.ఈ కార్యక్రమంలో విహెచ్ఎ వెంకటాద్రి, రామాంజనేయులు,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : వంశీకృష్ణ బాక్సర్ లో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కోరారు. ఎమ్మెల్యే సొంత డబ్బులు 50 వేల రూపాయలు వంశీకృష్ణకు అందజేసి ఎమ్మెల్యే దాతృత్వాన్ని చాటుకున్నారు.బుధవారం జనసేనపార్టీ ప్రధాన కార్యాలయంలో అందరి సమక్షంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి ,తనయులు సాయివికాస్ రెడ్డి వంశీకృష్ణ కు 50 వేల రూపాయలు చెక్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మార్గదర్శకతను కొనసాగిస్తూ వంశీకృష్ణకు 50 వేల రూపాయలు అందజేసి అదరించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే కి, వరలక్ష్మికి, తనయులు సాయివికాస్ రెడ్డికి శాలువా కప్పి పులమాలవేసి ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే దాతృత్వంతో బాక్సర్‌లో నా లక్ష్యం నెరవేరుతుందని వంశీకృష్ణ ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, సర్పంచ్ కారుమంచి సంయుక్త, పిసిఎన్ బ్రదర్స్ పగడాల చంద్రశేఖర్, వెంకటేష్,కట్టా ఉమాదేవి, గంగరాజు పుష్పలత, ముత్యాల కిషోర్ కుమార్, ముద్దపోలు రామసుబ్బయ్య, ఉత్తరాది శివకుమార్ రాగిపాటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులకు త్రిపుల్ ఐటీల్లో సీట్లు

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు త్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. పదవ తరగతిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులకు త్రిపుల్ ఐటీ లలో ప్రవేశం లభించింది. వెలిదండ్ల జడ్పి హై స్కూల్‌కు చెందిన అరుణ్ కుమార్ రెడ్డి 585 మార్కులు సాధించి త్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో సీటును సంపాదించాడు. అలాగే, పార్నపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎన్. సిరి 575 మార్కులు సాధించి శ్రీకాకుళం త్రిపుల్ ఐటీలో సీటు పొందింది. పెద్దకుడాల జడ్పీహెచ్ఎస్ లో చదివిన సుందరేశ్వర్‌కు శ్రీకాకుళం త్రిపుల్ ఐటీలో ప్రవేశం సాధించారని మండల విద్యాధికారి బలరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ విధంగా ప్రతిభను ప్రదర్శించి ఉన్నత విద్య అవకాశాలు పొందుతున్నత్తరుణంలో ఉపాధ్యాయుల కృషికి, విద్యార్థుల పట్టుదలకు ఇది ఫలితమని అభినందించారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-వేంపల్లి: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మేదర రవికుమార్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలసి గిరిజన సంక్షేమంపై ఆయనతో చర్చించారు. రాష్ట్రంలోని గిరిజన సమస్యలపైన, గిరిజన పాఠశాలలపైన విజిట్ చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లం దరూ కలిసి నారా లోకేష్‌తో చర్చించారు. గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా ఎంపిక చేసి 6నెలలు అవుతున్నా దీనికి సంబంధించి జీవో విడుదల కాలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జీవో విడుదల చేస్తే గిరిజన కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసి రాష్ట్రంలోని గిరిజన సంక్షేమం కోసం పాటు పెడతామని నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు గిరిజన కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు తెలిపారు.

గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-రామాపురం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాల5వ తరగతిలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ బైపిసి గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లకు బుధవారం విద్యార్థులు పరీక్షలురాశారు. ఈనెల26న 5వ తరగతి లో మిగిలిన సీట్లకు 27న ఉదయం తొమ్మిది గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాల చిన్న చౌకు కడప కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాల, కళాశాలల డిసిఒ ఉదయశ్రీ తెలియజేశారు. రామాపురం గురుకుల పాఠశాల పాఠశాల కళాశాలలో అర్హత పరీక్షరాసిన ఆసక్తి కలిగిన విద్యార్థులు హాజరు కావలసినదిగా కోరారు.

విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

విశాలాంధ్ర-సుండుపల్లె: ప్రభుత్వ బడుల్లో విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని రాయవరం సర్పంచ్ షరీఫ్ తెలిపారు. బుధవారం మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యావంతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో విద్యతో పాటు అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఆ పాఠశాలలోని 105 మంది విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు బట్టలు, బెల్ట్ లు, బ్యాగు ఉచితంగా ప్రభుత్వం అందించడంతో పంపిణీ చేశామన్నారు. అలాగే ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ కావడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని చేర్పించాలని కోరారు. ప్రైవేటు బడులకు పంపించి వేలాది రూపాయలు కట్టి మోసపోకండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, ఆర్జెయుపి మండల అధ్యక్షుడు సిద్దు నాయక్, చెనరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయలు మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ప్రభుత్వవైద్యాధికారి డాక్టర్ దిలీప్ వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎటువంటి రసాయనిక పురుగు మందులు వాడకుండా, ప్రకృతి వ్యవసాయపద్ధతిలో పండిన కూరగాయలు, ఆకుకూరలు వాడటంవలన ఆరోగ్యంగా ఉంటామని, మండలంలోనిప్రతి రైతు ప్రకృతి వ్యవసాయవిధానంలో పంటలు పండించాలని, అందులో పండిన కూరగాయలు, ఆకు కూరలు వాడాలని వివరించారు. ప్రతి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయసిబ్బంది తెలిపారు. ఇందులో మోడల్ మేకర్ లు రామాంజనేయులు, వీర నాగయ్య, యూనిట్ ఇంచార్జులు. యం. రాంమోహన్, పి. ఆంజనేయులు, ఎస్. వెంకటయ్య, సిడియఫ్ రమేష్, ఐసిఆర్పిలు కొండమ్మ, సుమలత, లక్ష్మి, ముజ్జురూన్, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన డీసీసీ బ్యాంక్ చైర్మన్

ఉమ్మడి కడప జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర -అట్లూరు: నూతన పాలనకు మార్గదర్శకుడైన, అభివృద్ధికి చిహ్నమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలోకడప జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డీసీసీ బ్యాంక్ చైర్మన్ గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, రైతు సంక్షేమంపై కీలక చర్చలు జరిపారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడంలో కూటమి ప్రభుత్వం ఉమ్మడి కడప జిల్లాకు ప్రత్యేక నిధుల కేటాయించాలని విజ్ఞప్తి చేశారు ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడును ఆయన కార్యాలయంలో కలిసి బ్యాంక్ కార్యకలాపాలు తదితర పలు విషయాలపై చర్చించారు. సూర్యనారాయణ రెడ్డి వెంట అట్లూరు మండల క్రియాశీల నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

అనధికార వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

విశాలాంధ్ర- మదనపల్లె : మదనపల్లెలో విచ్చలవిడిగా తయారైన అనధికార వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో ఇరుక్కున్న మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. మదనపల్లె లో గౌరీ అనే బాధితురాలు వడ్డీ వ్యాపారస్తుడైన మాజీ సైనికుడు ఏకాంబర రెడ్డి వేధింపులకు తట్టుకోలేక మంగళవారం మీడియా ముందుకు వచ్చి తన బాధను వెళ్లగక్కి తనకు చావే శరణ్యమని బోరున విలపించడంతో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి స్పందించారు. బుధవారం మదనపల్లె కు చేరుకున్న రమాదేవి బాధితురాలు గౌరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు జరిగిన అన్యాయం పై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ బాధితురాలు గౌరి తో పాటు ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మైక్రోసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి ఐద్వా అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు. ఇలాంటి బాధితులు ముందుకు రావాల్సిన అవసరత ఉందన్నారు. ఈ సమావేశంలో బాధితురాలు గౌరి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు, జిల్లా ఇన్చార్జ్ సాయిలక్ష్మి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, చిత్తూరు జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, మదనపల్లె పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి ప్రసన్న, షాహినా పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏపీ విద్యావంతుల వేదిక సభ్యులు

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి మండిపల్లి రాంప్ర సాద్ రెడ్డిని చైతన్య విద్యాసంస్థల ఏజీఎం డి.రమణయ్య, లాయర్ ఈశ్వర్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, పెమ్మడపల్లి సర్పంచ్ వాసు, మారుతి శంకర్, లాయర్ నాగమణి, చంద్రశేఖర్, భరత్ కుమార్, రామకృష్ణ, విలేఖరి, బీజేపీ నాయకులు శివప్రసాద్, జీవానందం, ఎర్రగట్టు నాగేశ్వర, వీరాంజ నేయులు, రవిశంకర్, బీసీ ఆకుల పోరాట సమితి కార్యదర్శి శ్రీనివాసులు, రాంప్ర సాద్, ఎల్ఐసి చిన్నప్ప, శ్రీరాములు తదిత రులు మర్యాదపూర్వకంగా కలిశారు. వేదిక ప్రతినిధులు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి న పలు అంశాలపై మంత్రితో చర్చించారు.

గుండె పోటుతో ఆటో డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-ముద్దనూరు: ముద్దనూరు టౌన్ కి చెందిన ఆటో డ్రైవర్ జమాల్ గుం డెపోటుతో మృతి చెందారు. ఆటో నడుపు కుంటూ జీవనం కొనసాగించేవారు. అతను మరణించడంతో అతని భార్య, ముగ్గురు కుమార్తెలు కన్నీటి పర్యంతమైయ్యారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు డా.మధుసూదన్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి రూ.50వేల రూపాయలు అందించారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

విశాలాంధ్ర-గాలివీడు: పోషకాహారంతో బాలింతలు గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత తలెత్తకుండా చూడవచ్చని అతెర సోలార్ కంపెనీ శిరీష, ప్రేరణ సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ స్వర్ణలత అన్నారు. బుధవారం మండలంలోని తూముకుంట గ్రామంలో గర్భవతులు, చిన్నారుల్లో వచ్చే రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు రక్తహీనత నుంచి బయట పడటానికి గానూ రాగిపిండి, గుడ్లు, పాలు, ఖర్జూరాలు, బెల్లం, వేరుశనక చిక్కీలు, అటుకులు, ఆకుకూరలతో వండిన కూరలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భవతుల కు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాలు శ్రీనువా సులు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘మొక్కజొన్న సీడ్స్’ యజమానిపై కేసు నమోదు చేయాలి

- రైతులను ఆదుకోవాలి: సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల మండలంలో మొక్కజొన్న సీడ్స్ కంపెనీ యాజమాన్యం రైతుల నుండి పం డిన పంట తీసుకెళ్లి డబ్బులు ఇవ్వమంటే, ఇవ్వకుండా ఎకరాకు కింటా పండినా 60 వేల రూపాయలు ఇస్తామని, నమ్మించి రైతులకు, అరచేతిలో వైకుంఠం చూపించే విధంగా రైతులకు మోసం చేయడం సరైన పద్ధతి కాదని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, పిరయ్య అన్నా రు. రైతుకు డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడు తూ రామాయపల్లి గ్రామంలో రైతుల వారి సమస్యలపై, రైతు ఆరుగాలులు కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి, పంట పండించి, పశువులు, పందులనుండి కాపాడుకొని చివరికి మొక్కజొన్న సీడ్స్ కంపెనీ వారికి అప్పగించి, డబ్బుల కోసం పడగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఫోను చేసిన ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడం, ఎప్పు డు అడిగినా గాని వారము, పది రోజులు అని కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని వారన్నారు. అలాగే మొక్కజొన్న సీడ్స్ కంపెనీ కి చెందిన డీలర్ వెంకటేశ్వర్ రెడ్డి, గురయ్యా, శీను, ప్రసాదు, వీరి యజమాని నారాయణ పై కేసులు నమోదు చేసి, జైలుకు పంపించి మరో రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని వారన్నారు. అదేవిధంగా రామాయ పల్లిలోకి చెందిన రైతులుతోపాటు, సిద్దవరం ,, అగ్రహారం, కృష్ణం పల్లె, కలసపాడు మండలంలో కొన్ని గ్రామాలు, బి. మఠం మండలంలో కొన్ని గ్రామాలు, ఈ విధంగా అనేక గ్రామాలలో ఈ మొక్కజొన్న సీడ్స్ కం పెనీవారు రైతులను మోసం చేస్తున్నారు, వీరి తోపాటు వేరే కంపెనీ వాళ్ళు కూడా మాకు నష్టం వచ్చిందని రైతులకు చెప్పిన మాట ప్రకారం కాకుండా రకరకాల రేట్లు తో వారి అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరుగు తోంది కనుక రైతులందరికీ కూడా గట్టి సోమవారం లోపు డబ్బులు ఇవ్వకపోతే జిల్లా ఎస్పీని కలిసి వారిపై క్రిమినల్ కేసులు నమో దు చేయిస్తామన్నారు. వెంటనే ప్రసన్న లక్ష్మీ సీడ్స్ కంపెనీవారు నారాయణ, వారి అనుచ రులు చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించక తప్ప దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో రామయ్య పల్లె గ్రామానికి చెందిన రైతులు వెంకటస్వామి, బాల చెన్నమ్మ, రమ ణయ్య, రాములమ్మ, రైతులు పాల్గొన్నారు.

బనకచర్లతో రాయలసీమకు ఉపయోగం అనడం తగదు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: గోదావరి, బనక చర్ల పేరుతో రాయలసీమకు ఉపయోగమని పదే పదే తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రక టించడం దారుణం అని రాయలసీమ పరిర క్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ విశయంలో దారుణమైన ప్రకటనలు జారీ చేస్తున్నారని, గోదావరి బనకచర్లలో మొదటి దశలో పోలవరం కుడి కాలువ వెడల్పు కోసం 30వేల కోట్లు ఖర్చు చేస్తారని తర్వాత దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ కోసం 30వేల కోట్లు ఖర్చు చేస్తామని మూడవ దశలో మాత్రమే రాయలసీమకు నీళ్లు వస్తాయి అని, మొదటి రెండవ దశలు దాటి రాయలసీమకు నీళ్లు రావడం అసాధ్యమని, గత టీడీపీ ప్రభుత్వ హ యాంలో గోదావరి పెన్నా అనుసంధానం అం టూ అసత్య ప్రచారాలు చేసి ఆంధ్రాకు లబ్ది చేకూర్చడానికి ప్రయత్నాలు జరిగాయని, తెలు గుదేశం ప్రభుత్వం ఉద్దేశం కేవలం పోలవరం కుడి కాలువ వెడల్పు మరియు బొల్లాపల్లి రిజ ర్వాయర్ మాత్రమే లక్ష్యం అని, రాయలసీమ కు నీళ్లు ఇవ్వడం ఉద్దేశం కాదని తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

విశాలాంధ్ర-రామాపురం: పండ్ల తోటల పెం పకానికి ఆసక్తిగల రైతులు ఈనెల చివరినాటికీ లోపు దరఖాస్తులు చేసుకోవచ్చని మండల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ఏపీవో పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలో బుధవారం గువ్వలచెరువు గ్రామంలో జరుగు తున్న ఉపాధి పనులలో పూడికతీతపనులను ఏపీవో పెంచలయ్య నీలకంఠరావుపేట గ్రామ లో కాలువ పూడిక తీత పనులను ఈసీ ఓబులేసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాల న్నారు. రైతులు తమ పొలాల వద్ద ఫారం ఫండ్ తీసుకోవడం వల్ల నీటినిలువకు ఎంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 190 ఎకరాల పండు తోటలో గుర్తించామని ఇంకా ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నా రు. ఈ కార్యక్రమంలో నీలకంఠరావుపేట గువ్వలచెరువు టెక్నికల్ అసిస్టెంట్స్ శివయ్య .సతీష్ కుమార్ రెడ్డి .ఫీల్డ్ అసిస్టెంట్లు పెంచల్ రెడ్డి రియాజ్ కూలీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పులివెందుల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. మలే రియా నివారణ మాసోత్సవం సందర్భంగా సింహాద్రిపురం మండలంలోని బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యంఎల్‌హెచ్‌పిలకు ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యక ర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే వర్షాలు కూడా వస్తున్నాయన్నారు. అలాగే వాతావరణంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఇలాంటి స్థితిలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కష్టతరమవుతుందన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజలకు దోమ కాటు వల్ల కలిగే వ్యాధులపై ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై అవ గాహన దోమల వృద్ధిని అడ్డుకునే మార్గాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచే విధానాలు, నీటి నిల్వలను తొలగించడం, దోమతెరల విని యోగం తదితర అంశాలపై అవగాహన కల్పిం చాలని వైద్యసిబ్బందిని కోరారు. వెక్టర్ కం ట్రోల్, ఫ్రైడే - డ్రైడే, దోమకాటుకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దోమకా టు వల్ల వచ్చు వ్యాదుల గురించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పిహెచ్‌యన్ పద్మావతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం - బనకచర్ల రాష్ట్రానికి గుదిబండ

విశాలాంధ్ర-వేంపల్లి: రాష్ట్రంలో నూతనంగా చేపట్ట నున్న పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్ గుది బండ కానుందని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ముందుకే పోవాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. ము ఖ్యమంత్రి చెబుతున్నట్లు రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కాదని అది గుదిబండ అవుతుం దన్నారు. దీని అంచనా విలువ రూ. 81, 900కోట్లు. ఇందులో సింహ భాగం అప్పు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల కుప్ప అయింద న్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రం శాస్వ తంగా అప్పుల ఊబిలో కూరుకుపోతుం దన్నారు. తెలంగాణకు కాళేశ్వరం గుదిబ ండ అయినట్లు ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు గుదిబండ అవుతుందన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ తదితర నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నిధుల కొరత వల్ల నత్తనడకన సాగుతున్నాయని. వీటికి నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గండికోట రిజర్వాయర్ కింద 22గ్రామాలు ముంపునకు గురయ్యా యని, ఆ గ్రామాల ప్రజలు పునరావాస కాలనీలలో నివాసం ఉంటున్నారు. కానీ అక్కడ రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలు తదితర మౌలిక సదుపా యాలు లేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. వీటి మీద శ్రద్ధ పెట్టాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజధాని కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద 50వేల ఎకరాలు ఉందని. ఇది చాలక ఇంకా 44వేల ఎకరాల భూమిని సమీకరిం చాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం శోచనీయం అని తులసిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా చేస్తున్నదా లేక రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదా అని తులసి రెడ్డి ప్రశ్నించారు.

అనాధలకు ఆపన్నహస్తాలు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: సమాజంలో మనుషుల పరిస్థితులు ఏ స్థాయికి చేరుస్తాయో ఎవరూ ఊహించలేరు, చక్కని కుటుంబానికి ధనం, ఆస్తులు, అంతస్తులు ఉన్నా కొందరు పరిస్థితుల ప్రభావంతో అనాధలుగా మారుతుంటారు, వారికి చేయూతను ఇవ్వాల్సిన అవసరం సాటి మనుషులుగా అందరూ చేయూతను ఇవ్వాలని చెప్పడమే కాకుండా చేసి చూపిస్తున్నారు. కోడూరు టౌన్ చిట్వేల్ రోడ్డులోని గవర్నమెంట్ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటు బయట రహదారి పక్కన అనాధగా పడిఉన్న వృద్ధుడి విషయం శ్రీసాయి ఈశ్వరమ్మ వృద్ధాశ్రమం అధ్యక్షురాలు, విపిఆర్ ఖండ్రిక మాజీ సర్పంచ్ గంగరాజు పుష్పలత కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి దృష్టికి తీసుకుపోవడంతో తక్షణం స్పందిం చిన వరలక్ష్మి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ఆనాథవృద్ధుని వద్దకు వెళ్లి పరిశీ లించి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆనాధ వృద్ధుని ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు బ్రహ్మకుమారి, సాయిలను ఆదేశిం చారు. మెరుగైన వైద్యం అందిస్తామని డాక్టర్లు వరలక్ష్మికి హామీ ఇచ్చారు. అనం తరం ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ల కు సూచనలు సలహాలు ఇచ్చారు. వీరి వెంట మహిళా నాయకురాలు కట్టా ఉమాదేవి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.